క్లుప్తంగా

బీఆర్ఎస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న పుట్ట మధు

కాటారం: కాటారం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం డైరెక్టర్, మండలంలోని అంకుషాపూర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు ఐలి రాజబాబు శుక్రవారం రాత్రి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మంథనిలోని రాజగృహాలో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు సమక్షంలో పార్టీలో చేరగా కండువా కప్పి రాజబాబును ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

చేయూత



గోవిందరావుపేట: మండలంలోని మచ్చాపూర్ గ్రామానికి చెందిన రజిత భర్త రఘు కొద్ది రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. దీంతో రజితతో కలిసి 1998-99లో చల్వాయి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకున్న తోటి స్నేహితులు శనివారం చేయూతనందించారు. గుండేటి సతీశ్ ఆధ్వర్యంలో స్నేహితులందరూ కలిసి రూ.25 వేలు సేకరించి రజితకు అందజేశారు. పైడాకుల సుజాత, శ్వేత, రమేశ్, ప్రసాద్, హేమలత, అరుణ, శ్రీలత, రాజేష్, దుర్గ, శ్రీనివాస్, సునీల్, శ్రీలత, కవిత, రామస్వామి, లావణ్య, జయచందర్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



వాజేడు: మండల పరిధిలోని చింతూరు గ్రామానికి చెందిన పేట నగేష్ అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బందం కృష్ణ శనివారం పరామర్శించి దహన సంస్కారాల నిమిత్తం రూ.3,000 ఆర్థిక సాయం అందించారు. యాదవ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నలగాసి రమేశ్, రఘుపతి, బత్తయ్య కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు నర్సమ్మ ఉన్నారు.

ప్రమాదకరంగా రహదారి



వాజేడు: మండల పరిధిలోని జంగాలపల్లి, పెనుగోలు కాలనీ గ్రామాల రహదారి ప్రమాదకరంగా ఉంది. ఈ రెండు గ్రామాల నుంచి ప్రధాన రహదారికి రావడం కోసం ఉపాధిహామీ పథకంలో మట్టితో రహదారిని వేశారు. ఎగువ ప్రాంతం నుంచి వర్షం నీరు పోవడం కోసం తూములను ఏర్పాటు చేశారు. ఈ ఏడాది కురిసిన వర్షాలకు ఈ తూముల వద్ద మట్టి కొట్టుకు పోయి ప్రమాదకరంగా మారింది. అటుగా వచ్చి వెళ్లే వారికి ఎలాంటి ప్రమాదం జరుగకుండా ముందస్తు జాగ్రత్తగా స్థానికులు కర్రకు గుడ్డను కట్టి అక్కడ ఉంచారు. ప్రమాదం జరుగక ముందే అధికారులు మరమ్మతు చేయాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషి

● పస్రా సీఐ దయాకర్



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న సీఐ దయాకర్

ఎస్ఎస్‌తాడ్వాయి: రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పస్రా సీఐ దయాకర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతపై నిర్వహించిన అవగాహన సమావేశంలో సీఐ మాట్లాడారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని అన్నారు. డ్రైవింగ్ చేస్తున్న సమయంలో జాగ్రతలు తీసుకుంటే ఎంతో మంది ప్రాణాలను కాపాడవచ్చు అని తెలిపారు. ప్రయాణికుల ప్రాణభద్రతకు తీసుకోవాల్సిన జాగ్రతలపై, అధిక ప్రయాణికుల రవాణా వల్ల కలగే ప్రమాదాలపై వివరించారు.

అధ్వానంగా రోడ్లు

● మట్టి రోడ్లతో రైతుల ఇబ్బందులు
● నిధులు మంజూరైనా ప్రారంభం కాని పనులు



టేకుమట్లలో అధ్వానంగా ఉన్న దారి

టేకుమట్ల: గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ మంది వ్యవసాయం పైన ఆధారపడి జీవనాన్ని కొనసాగిస్తోంటారు. గ్రామాల నుంచి పంట పొలాలకు వెళ్లే దారులు అధ్వానంగా మారడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతోన్నారు. మట్టి రోడ్లు కావడంతో వర్షాకాలంలో రోడ్లు బురదమయమై కనీసం నడవలేని పరిస్థితి. గతంలో మండలంలోని వెలిశాల నుంచి పెద్దంపల్లి మీదుగా రాఘవపూర్ వైపు రోడ్డు నిర్మాణానికి రూ.రెండు కోట్ల 70 లక్షల నిధులను కేటాయించారు. కానీ సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాకపోవడంతో రైతులు నరకయాతన అనుభవిస్తున్నారు. అలాగే ఇటీవల ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆరెపల్లి శివారు, రామకృష్ణాపూర్ (టి), టేకుమట్ల ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి అంకుషాపూర్ వరకు గల రైతుల దారులకు ఒక్కో రోడ్డుకు రూ.10 లక్షల నిధులను మంజూరు చేసి పనులకు శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన చేసి రెండు నెలలుగా వస్తున్న ఇప్పటివరకు పనులు ప్రారంభం కాకపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పాలకులు స్పందించి రోడ్ల నిర్మాణాన్ని వెంటనే చేపట్టి ఇబ్బందులను తొలగించాలని రైతులు వేడుకుంటున్నారు.

రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలి



అంకుశాపూర్ నుంచి టేకుమట్ల ఆర్అండ్‌బీ రోడ్డు వరకు గతంలో రోడ్డు వేయగా ఆ దారి గుండా పంట పొలాలకు వెళ్లే వాళ్లం. ఇప్పుడు ఆ రోడ్డు మొత్తం గుంతలమయం కావడంతో టేకుమట్ల నుంచి తిరిగిపోవాల్సి వస్తోంది. అదే రోడ్డు బాగు చేస్తే తక్కువ దూరంలో పంటపొలాలకు వెళ్తాం. కావున త్వరగా రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలి.

- మేకల సదయ్య రైతు, అంకుశాపూర్

సామాజిక తనిఖీ ప్రజావేదిక



ప్రజావేదికలో పాల్గొన్న జిల్లా అధికారులు

చిట్యాల: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా జిల్లా అధికారుల సమక్షంలో శనివారం 16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఆర్‌డీఏ పీడీ బాలకృష్ణ హాజరయ్యారు. మండలంలోని వివిధ గ్రామాలలో చేపట్టిన ఉపాధిహామీ పనులపై సమీక్ష నిర్వహించి చేసిన పనుల నివేదికను వీఆర్‌పీలు చదివి వినిపించారు. అనంతరం పనులపై పంచాయతీ కార్యదర్శులు, ఏఈలు, ఉపాధిహామీ సిబ్బంది తప్పుల తడకగా నివేదికలు సమర్పించడంతో వారికి జిల్లా అధికారులు జరిమానా విధించారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ.39165, ఏఈలకు 24631, పంచాయతీ కార్యదర్శులకు 54,737, టీఏలకు 9908లు జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ అధికారి ధరమ్‌సింగ్, జిల్లా విజిలేన్స్ అధికారి రుబినాబేగం, ప్రవీన్, అంబుడ్స్‌మేన్ శ్రీనివాస్, ఎంపీడీఓ జయశ్రీ, ఎపీఓ హాలీంపాషా, పీఆర్ఏఈలు అరుణ, తిరుపతి, ఎస్ఆర్‌పీ, డీఆర్‌పీ, బీఆర్‌పీ, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఈజీఏస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోటరీక్లబ్ సేవలు అభినందనీయం

నల్లబెల్లి: పాఠశాలల బలోపేతంలో భాగంగా రోటరీ క్లబ్ అందిస్తున్న సేవలు అభినందనీయమని హెచ్ఎం సుధాకర్ రావు అన్నారు. హనుమకొండ రోటరీ క్లబ్ సహకారంతో మండలంలోని నారక్కపేట హైస్కూల్‌కు శనివారం డ్యూయల్ డెస్క్ బెంచీలు అందించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంతో పాటు దాతలు అందిస్తున్న వసతులను సద్వినియోగించుకుని విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించాలని కోరారు. పాఠశాల వాటాధనాన్ని ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా అందించారు. భవిష్యత్‌లో రోటరీ క్లబ్ సహకారంతో పాఠశాల విద్యార్థినులకు సైకిల్స్ పంపిణీ చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దామోదర్, నీలిమ, సుధాకర్, ఆశాసుల్తాన, వినోద, రాజు, మహిపాల్, మహేందర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



పరామర్శిస్తున్న కీర్తిరెడ్డి

మొగుళ్లపల్లి: మండల కేంద్రానికి చెందిన మోరె సముద్రమ్మ, బండారి సమ్మక్క ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి శనివారం పరామర్శించారు. జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిశిధర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెన్నంపల్లి పాపయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు మోరే రవీందర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, భిక్షపతి, రాజేంద్రప్రసాద్, తిరుపతి, ఎర్ర రాకేశ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రేగొండ: మండలంలోని రావులపల్లికి చెందిన ఏడెల్లి వెంకట్‌రెడ్డి మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిశిధర్ రెడ్డి పరామర్శించి మృత దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ రాజు నాయకులు బుచ్చిరెడ్డి, లింగారెడ్డి, రమణారెడ్డి, సమ్మిరెడ్డి, రఘు, రాజు, తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం

మండలంలోని రావులపల్లికి చెందిన అన్నారపు రమ ఇటీవల మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు భిక్షపతి పరామర్శించి, రూ.2వేలు ఆర్థిక సాయం అందజేశారు. శంకర్ ,రాజు, పోషాలు, లింగారెడ్డి, శ్రీను, తదితరులు ఉన్నారు.

సంప్రదాయాలను కాపాడాలి



స్టాళ్లను సందర్శిస్తున్న కళాశాల రమణారావు

భూపాలపల్లి అర్బన్: భారతీయ సంస్కృతి సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత యువతపైన ఉందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమణారావు తెలిపారు. భారత ప్రభుత్వ పర్యావరణ, వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో తెలంగాణ గ్రీన్ కార్ప్స్ సౌజన్యంతో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం క్యాంపస్ ఎకో బజార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. నేటి అనిశ్చిత వాతావరణం దృష్ట్యా పర్యావరణ రహిత, భారత సాంప్రదాయ ఉత్పత్తులతో దీపావళి పండుగను సమాజ హితం దృష్టిలో ఉంచుకొని నిర్వహించుకోవాలని సూచించారు. ప్రకృతి హితమైన జీవన శైలిని అలవర్చుకోవాలని, స్వదేశీ వస్తువులను ప్రోత్సహించాలని సూచించారు. అంతకుముందు కళాశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. హస్తకళలు, చేతివృత్తులు, పేపర్ బ్యాగ్స్, గాజులు, మట్టి దీప ప్రమిదలు, తృణధాన్యాలతో చేసిన పిండి వంటకాలు, జావా, చెత్తను వేరు చేయు విధానం, వివరించే స్టాల్స్ సందేశకులందరిని ఆకట్టుకున్నాయని విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రుక్షాన మహమ్మద్, అధ్యాపకులు చంద్రకళ, కవిత, కాత్య, కుమారస్వామి, శ్రీధర్, హైమావతి, రామచందర్, దేవేందర్, శ్రీనివాస్, వరలక్ష్మి, సమీరా, హనుము, శిరీష, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీ బంద్ విజయవంతం



కాటారం: బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



మొగుళ్లపల్లి: నిరసన తెలుపుతున్న నాయకులు

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ శనివారం రాష్ట్ర బంద్ పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా బీసీ బంద్ విజయవంతమైంది. బంద్‌కు అన్ని రాజకీయ పార్టీలు, విద్యార్థి, ఉద్యోగ, కార్మిక, కుల సంఘాలతో పాటు వ్యాపార వాణిజ్య సంస్థలు సంపూర్ణ మద్దతు తెలిపాయి. పలు రకాల షాపులు, కిరాణా దుకాణాలు, హోటళ్ల నిర్వాహకులు స్వచ్ఛందంగా బంద్ చేసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు ర్యాలీలు నిర్వహించి, రహదారిపై రాస్తారోకో చేశారు.

- సాక్షి నెట్‌వర్క్



మల్హర్: కొయ్యూరులో నినాదాలు చేస్తున్న నాయకులు



కాటారం: అంబేడ్కర్ కూడలి వద్ద నాయకులు



రేగొండ: ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



పలిమెల: పాఠశాలను బంద్ చేపిస్తున్న నాయకులు



చిట్యాల: శాంతినగర్‌లో..



మహదేవపూర్‌లో బంద్‌లో పాల్గొన్న బీసీ కుల సంఘాల జేఏసీ నాయకులు

కిసాన్ యాప్ ద్వారానే పత్తి విక్రయాలు

● ఏఓ గంగాజమున



రైతులతో మాట్లాడుతున్న ఏఓ గంగాజమున

శాయంపేట : కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పత్తి రైతులు కపాస్ కిసాన్ యాప్ ద్వారానే పత్తి విక్రయాలు నిర్వహించాల్సి ఉంటుందని ఏఓ క్యాతం గంగాజమున తెలిపారు. శనివారం మండలంలోని మైలారం, కొత్తగట్టు సింగారం గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో రైతుల జాబితాను ప్రదర్శించారు. అనంతరం మైలారం గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో రైతులతో మాట్లాడారు. పత్తి రైతులు తప్పనిసరిగా తమ పంట వివరాలను సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద నమోదు చేసుకోవాలని, ఇదివరకే నమోదు చేసుకున్న రైతులు తమ వివరాలను సరిగా ఉన్నాయో లేదో అని వ్యాసాయ విస్తరణ అధికారుల వద్ద చూసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఓటీపీ ఆధారిత పద్ధతిలో పత్తి విక్రయాలు జరుగుతున్నాయని, రైతులు తమ మొబైల్ సరిగా నంబర్ ఉందో లేదో నిర్ధారించుకోవాలన్నారు. మైలారం ఏఈఓ అన్వేష్, కొత్తగట్టు సింగారం, ఏఈఓ రాకేశ్, రైతులు పాల్గొన్నారు.

గుడి స్థలంపై ప్రకటన సిగ్గుచేటు



మాట్లాడుతున్న రాజేశ్వర్‌రావు

పరకాల : పట్టణంలోని పశువుల సంత స్థలం శ్రీకుంకుమేశ్వర స్వామి దేవస్థానానికి సంబంధించినట్లు కోర్టు ఇచ్చిన తీర్పు విజయం వెనుక మాజీ చైర్మన్ గండె వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ పాత్ర ఏ మాత్రం లేదని దేవస్థానం చైర్మన్ కొలుగూరి రాజేశ్వర్‌రావు స్పష్టం చేశారు. గుడి స్థలంపై ఆయన చేసిన ప్రకటన సిగ్గుచేటని ఆరోపించారు. శనివారం దేవస్థానం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పరకాల పశువుల సంత స్థలంపై 1984 నుంచి వివాదం నడుస్తుందన్నారు. ఆ భూమి దేవస్థానానికి సంబంధించినట్లుగా కోర్టు ముందు ఆధారాలు పెట్టడానికి గతంలో తాను చైర్మన్‌గా పనిచేసిన సమయంలో ఎంతగానో శ్రమించినట్లు తెలిపారు. తనతో పాటు ధర్మకర్తల మండలి, రెవెన్యూ అధికారుల సహకారంతో భూ రికార్డులను సేకరించడం, గవర్నమెంట్ ప్లీడర్‌లకు అందించడం ద్వారా కేసు నెగ్గేందుకు బలం చేకూరిందన్నారు. పశువుల సంత ద్వారా పరకాల మున్సిపాలిటీకి ఏడాదికి రూ.5లక్షల ఆదాయం రావడంలో తమ కృషి ఉందన్నారు. అయితే హైకోర్టు ఆదేశాల మేరకు పశువుల సంత స్థలం దేవస్థానానికి సంబంధించినట్లు రెవెన్యూ అధికారులు తేల్చడంపై మాజీ చైర్మన్ గండె వెంకటేశ్వర్లు చేసిన వ్యాఖ్యలు హాస్యస్పదంగా ఉన్నాయన్నారు.

జాతీయ స్థాయి ఖోఖో కోచింగ్ క్యాంపు ప్రారంభం

నర్సంపేట రూరల్ : మండలంలోని మహేశ్వరం శివారులోని శివాని పబ్లిక్ స్కూల్‌లో శనివారం జాతీయస్థాయి ఖోఖో కోచింగ్ క్యాంపును స్థానిక ఎంఈఓ కొర్ర సారయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడలను ప్రారంభించారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ ఈకోచింగ్ క్యాంప్‌లో 20 మంది మహిళలు, 20 మంది పురుషులు పాల్గొన్నారని, శనివారం నుంచి ఈనెల 22 వరకు కోచింగ్ ఇవ్వనున్నట్లు చెప్పారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులు ఈనెల 24 నుంచి 26 వరకు బెంగళూర్‌లో జరిగే జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. వీరగాని స్వప్న, కోట రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలల హక్కులను సంరక్షించాలి



మాట్లాడుతున్న సాయిశరత్

శాయంపేట : బాలల హక్కులను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పరకాల జూనియర్ సివిల్ న్యాయమూర్తి సాయిశరత్ అన్నారు. శనివారం మండలంలోని మాందారిపేట శివారులో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో స్పెషల్ ఆఫీసర్ మాధవి అధ్యక్షతన న్యాయ విభాగంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని, సాంకేతిక మోసాలతోనే విద్యార్థులను అక్రమ రవాణాకు టార్గెట్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్న వయస్సులో వివాహాలు చేయవద్దని, ఎవరైనా బాల్య వివాహాలు చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శాయంపేట సీఐ రంజిత్ రావు, ఎస్సై జక్కుల పరమేశ్, పరకాల లీగల్ సెల్ మెంబర్ రాజమౌళి, అడ్వొకేట్ మేకల శ్రవణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పల్లెల్లో యథేచ్ఛగా గుడుంబా!

జోరుగా తయారీ, విక్రయాలు

● పట్టపగలు ద్విచక్ర వాహనాలపై తరలింపు
● పట్టించుకోని అధికారులు




తయారు చేస్తున్న గుడుంబా(ఫైల్)

మంగపేట: మండలంలోని పలు గ్రామాల్లో గుడుంబా గుప్పు మంటోంది. కొద్ది నెలల నుంచి మండలంలో గుడుంబా తయారీ విక్రయాలపై సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో మండలంలోని కమలాపురం, తిమ్మంపేట, మల్లూరు, నర్సింహాసాగర్ రాజుపేట తదితర గ్రామాల్లో గుడుంబా తయారీ విక్రయాలు విరివిగా కొనసాగుతోన్నాయి. రాజుపేట, కమలాపురం, మల్లూరు, తిమ్మంపేట గ్రామాల్లో పట్టపగలే గుడుంబా తయారీ చేస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో మండలంలోని గ్రామాల్లో వీధికో గుడుంబా బట్టీ, రెండు నుంచి నాలుగు వరకు ప్రత్యేక గుడుంబా విక్రయాల షాపులు కనిపించడం విశేషం.

ద్విచక్ర వాహనాలపై సరఫరా..

మండలంలోని కమలాపురం, తిమ్మంపేట గ్రామాలతో పాటు జిల్లా సరిహద్దు గ్రామం అయిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం దుగినేపల్లి నుంచి ఉదయం సాయంత్రం వందల లీటర్ల గుడుంబాను ద్విచక్ర వాహనాలపై తీసుకువచ్చి మండలంలోని పలు గ్రామాల్లో గుడుంబా విక్రయదారులకు చేరవేస్తోన్నట్లు సమాచారం. గుడుంబా తయారీపై ఎక్సైజ్ శాఖ అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తుండటంతో గ్రామాల్లో ప్రధాన రోడ్ల వెంట గుడుంబా తయారీ కేంద్రాల నిర్వహణ సాగుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు. దినసరి కూలీలు, నిరుపేదలు, యువత తక్కువ ధరకు లభించే గుడుంబాను తాగి అనారోగ్యాల పాలవుతోన్నారు. గుడుంబాకు బానిసలుగా మారి కుటుంబ పోషణను పట్టించుకోక పోవడం లేదని బాధిత కుటుంబాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి గుడుంబా తయారీ, విక్రయాలను అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి జ్యోతి

వెంకటాపురం(కె): పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తేనే ఆరోగ్యంగా ఉంటామని వైద్యాధికారి అజ్మీరా జ్యోతి అన్నారు. శనివారం మండల పరిధిలోని సుడిబాక తోగుబోరులో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. వారి వద్ద నుంచి రక్త నమూనాలను సేకరించారు. అనంతరం గ్రామస్తులకు సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. తప్పనిసరిగా దోమ తెరలను వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఉన్నారు.